





# Voice of Jagadguru

advaitam paramanandam

an e-magazine on advaita

## The 75th Vardhanti of Jagadguru Shankaracaryar His Holiness Mahasannidhanam Sri Sri Sri Bharati Tirtha Mahaswamiji



# Vajrotsava Bharathi

## SPECIAL SOUVENIR 1

**Our humble pranams at the lotus feet of Jagadguru Śankaracārya Mahāsannidhānam His Holiness Śri Śri Śri Bhārati Tīrtha Mahāswāmi-ji. We submit our efforts at the lotus feet of Jagadguru Śankaracārya His Holiness Mahāsannidhānam Śrī Śrī Srī Bhāratī Tīrtha Mahāswāmiji and Jagadguru Śankaracārya His Holiness Sannidhānam Śrī Śrī Śrī Vidhuśekhara Bhāratī Mahāswāmiji.**

We submit our efforts at the Lotus feet of Jagadguru Śankarācārya His Holiness Mahāsannidhānam Śrī Śrī Srī Bhāratī Tīrtha Mahāswāmiji and Jagadguru Śankarācārya His Holiness Sannidhānam Śrī Śrī Śrī Vidhuśekhara Bhāratī Mahāswāmiji

## Jagadguru Vani అనుగ్రహ భాషణం

అన్నింటినీ మంచి సంస్కారముతో స్వీకరించండి.




ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం ఉంటుంది. చదువుకున్నవారు లేదా చదువుకోనివారు, ధనికులు లేదా పేదలు, అందరికీ ఆత్మగౌరవం ఉంటుంది. దీనిని మనం అర్థం చేసుకొని తదనుగుణంగా వ్యవహరించాలి. లేకపోతే, ఇది అనేక అవాంఛనీయమైన పరిణామాలకు దారితీస్తుంది. ఉదాహరణకు, ఒక సాధు వ్యక్తిని అవమానిస్తే, ఆ అవమానం అతనికి ఎలాంటి హాని కలిగించదు. కానీ అతడిని అవమానించిన వ్యక్తి, విపత్కర పరిణామాలను ఎదుర్కోనవలసి ఉంటుంది.

దుర్యోధనుడు ద్రౌపదిని అవమానించాడు. శ్రీకృష్ణ భగవాన్ స్వయంగా ఆమెను రక్షించడానికి వచ్చాడు. అతని దుశ్చర్యల కారణంగా, దుర్యోధనుడు అనేక విధాలుగా అనివార్యంగా బాధపడాల్సి వచ్చింది. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని వేధించినాడు, అవమానించినాడు. కానీ చివరికి అతడే నాశనం అయ్యాడు.

ఇక్కడ మనం నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటంటే మనం అందరికి గౌరవం ఇవ్వాలి. ఇతరులను గౌరవించడం మన మంచి ప్రవర్తనను ఋజువు చేస్తుంది మరియు పేరు, కీర్తిని తెచ్చిబెడుతుంది.

ఇతరులను గౌరవించడం మంచి సంస్కారానికి దారితీస్తుంది. వశిష్ఠ మహర్షి భార్య అరుంధతి దేవి, సీతమ్మకి ఉత్తర రామాయణంలో ఏమని చెబుతుందంటే, “ఎక్కడ మంచితనం ఉన్నదో అక్కడ గౌరవం చూపాలని”.

गुणाः पूजास्थानं गुणिषु न च लिङ्गं न च वयः

అంటే, ఇతరులకు గౌరవం చూపించే విషయంలో, మంచితనం మాత్రమే పరిగణించబడుతుంది. ఒక వ్యక్తిని గౌరవించడానికి ఆ వ్యక్తి యొక్క వయస్సు లేదా లింగమును ప్రధాన కారకాలుగా మనం పరిగణించకూడదు.

ఆస్తికులందరూ దీనిని బాగా అర్థం చేసుకోవాలి, “అందరినీ గౌరవించండి మరియు మంచి సంస్కారం పెంపొందించుకోండి”.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం.**

Our mail ID : info@voiceofjagadguru.com

తెలుగు అనువాదము, రచన - శ్రీ భాస్కరానంద నాథ

## అనుగ్రహ భాషణం 2 - సాత్త్విక తత్త్వముతో అవరోధములను అధిగమించండి



ఎవరైనా ఏది చేసినా అది ధర్మానికి మరియు న్యాయానికి విరుద్ధంగా ఉండకూడదు. ధర్మానికి అనుగుణంగా ఓ పని లో పాల్గొన్నప్పుడు, అనేక ఇబ్బందులను ఎదుర్కొన వచ్చును.

అలాంటి ఇబ్బందుల్లో పడటం ఎవ్వరికీ ఇష్టం వుండదు. ద్రవ్య నష్టం ఉండవచ్చును, ప్రాణానికే ముప్పు పొంచి ఉండవచ్చును. అయిననూ ధృఢ సంకల్పముతో, ధర్మం మరియు సత్యముల పై అచంచలమైన విశ్వాసంతో, ఒక గొప్ప పనిని పూర్తి చేయాలి.

అడ్డంకులకు భయపడి, కొందరు మంచి పనిని చేపట్టడానికి కూడా వెనుకాడతారు. కొందరు పనిని ప్రారంభిస్తారు, కానీ ఏదైనా ఇబ్బంది ఎదురైతే దాన్ని మధ్యలో వదిలేస్తారు. కానీ ఒక మహోన్నత వ్యక్తి అతను ఎంతటి కష్టాన్ని ఎదుర్కొన్నా తన పనిని తాను పూర్తి చేస్తాడు.

జగద్గురు శ్రీ ఆదిశంకర భగవత్పాదులు చాలా బాధలను అనుభవించినారు మరియు ధర్మ ప్రచారం కోసం భారతావనిని కాలినడకన ప్రయాణించి వచ్చారు. ప్రయాణం యొక్క అన్ని అసౌకర్యాలు మరియు ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, అతను తన లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా ఒక ఉదాహరణగా నిలిచినాడు. కష్టమైన పరిస్థితులలో అవసరమైన దృఢ సంకల్పం మరియు ధైర్యమును మనమందరం గుర్తుంచుకోవడం మంచిది.

భగవద్గీతలో, శ్రీకృష్ణుడు మూడు రకాల మానసిక ధైర్య, స్థైర్యముల గురించి చెబుతాడు. సాత్త్విక, రాజసిక మరియు తామసిక. మనస్సు మరియు ఇంద్రియాలను నియంత్రించగల సామర్థ్యం మరియు ఎటువంటి కష్టాలనైనా భరించ గలిగే సామర్థ్యము ను సాత్త్విక ధైర్యం అంటారు. అంత ధైర్యం ఉన్న వ్యక్తి తన పనిని ఏ విధముగానైనా పూర్తి చేస్తాడు. అతను చాలా మందికి సహాయం చేస్తూ మరియు పేరు ప్రఖ్యాతులను పొందగలడు.

प्रारभ्यते न खलु विघ्नभयेन नीचैः प्रारभ्य विघ्नविहता विरमन्ति मध्याः ।

विघ्नैः पुनः पुनरपि प्रतिहन्यमानाः प्रारब्धमुत्तमगुणा न परित्जयन्ति ॥

అందువల్ల, కష్టాలు ఏవైనా సరే, ధైర్యంతో ఒక ధర్మబద్ధమైన పనిని పూర్తి చేయాలి. చేపట్టిన కార్యక్రమములను తెగువతో పూర్తి చేయడానికి సంబంధించిన పట్టుదల కారణముగా మనం చేసే పనిలో ఒక నాణ్యత ఉంటుంది, ప్రాపంచిక ప్రయత్నాలలో కూడా శ్రేయస్సు కలుగుతుంది. ఆధ్యాత్మిక మార్గంలో శ్రేయస్సులు పొందడం నిజంగా ఎంతో అవసరం.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం.**

తెలుగు అనువాదము, రచన - శ్రీ భాస్కరానంద నాథ

Our mail ID : info@voiceofjagadguru.com

## అనుగ్రహ భాషణం 3 - సంతృప్తి సంతోషానికి దారి తీస్తుంది



మనిషి జీవితంలో సంతృప్తి ఎంతో అవసరం. ఎంత ధనవంతుడైనప్పటికీ, అతను సంతృప్తిగా లేకుండా వుంటే సంతోషంగా ఉండ లేడు.

కోరికలను సంతృప్తి పరచడానికి చాలా ప్రయత్నాలు, కృషి అవసరం. ఈ ప్రక్రియలో సంతోషం ఏమి లేదు. ఒకవేళ ఆ వస్తువును పొందినప్పటికీ, దానిని కాపాడటంలో ఎంతో కష్టం ఉన్నది. ఇక్కడ కూడా మనం ఆనందాన్ని అనుభవించుట లేదు. ఒకవేళ కష్టపడి సంపాదించిన వస్తువు పోతే దుఃఖం మాత్రమే మిగులుతుంది. అందువల్ల, కోరిక మీద కోరికలను పెంచుకోకూడదు. పాత రోజుల్లో,ఋషులు అడవులలో నివసించేవారు. సౌకర్యాలు లేకపోయినా వారు సంతోషంగా ఉండేవారు. అది వారి మానసిక సంతృప్తి కారణంగా అలా జరిగేది.

మనం ఎంత ధనవంతులమైనప్పటికీ, ఓ సాధారణమైన వ్యక్తిగా సంతృప్తికరముగా ఉండగలగాలి. అప్పుడు మాత్రమే మనం సంతోషంగా ఉండగలం. మనం ప్రయత్నాలు చేపట్ట కుండా, ఒకవేళ సంపద మనకు వస్తే, దానిని కూడా మంచి ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలి. ఇలా చేయడం వల్ల మన జీవితాలు శుద్ధి అవుతాయి.

పురాణాలలో, పరమేశ్వరుడు పులి చర్మంతో కప్పబడి, బూడిదను పూసుకొని, ఎద్దుపై స్వారీ చేస్తున్నట్లు చిత్రీకరించబడి వుంటుంది. ఇది ఇంద్రియ సుఖాల నుండి నిర్లిప్తతను, విముఖతను సూచిస్తుంది.

అందుకే ప్రాజ్ఞులు ఏమన్నారంటే ? నిజమైన ధనవంతుడు మరియు నిజమైన పేదవాడు ఎవరు అనే దాని గురించి ఈ క్రింది విధంగా పలికినారు - "ఎవడు ధనవంతుడు అంటే ? కోరికలు లేకుండా, సంతృప్తికరంగా వుండేవాడు ధనవంతుడు. ఎవరు ఇలా వుండలేరో వారు పేద వాళ్ళు అని ".

वयमिह परितुष्टा वल्कलैस्त्वं दुकूलैः सम इह परितोषो निर्विशेषो विशेषः ।


स हि भवति दरिद्रो यस्य तृष्णा विशाला मनसि च परितुष्टे कोऽर्थवान् को दरिद्रः ॥

అందువల్ల, సంతృప్తితో నిండిన ఆనందాన్ని జీవితంలో ప్రధాన లక్ష్యంగా చేసుకోవడం వలన ప్రతి ఒక్కరికీ ఉత్తమ ప్రయోజనాలు కలుగుతాయి.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం.**

Our mail ID : info@voiceofjagadguru.com

## అనుగ్రహ భాషణం 4 - ఇచ్చినదానిని ఎప్పటికీ వెనక్కి తీసుకోకూడదు.



ఒక వ్యక్తికి దానంగా ఇచ్చిన దానిని తిరిగి తీసుకోవడం సాధారణంగా పాపం. ఇంకా చెప్పాలంటే, ఒక బ్రాహ్మణుడికి ఇచ్చిన దానిని తీసుకోవడం మహా పాపం. దీనికి సంబంధించిన కథ ఒకటి శ్రీమద్భాగవతములో వున్నది.

ఒకప్పుడు నృగ మహా రాజు అనే రాజు ఉండేవాడు. అతను ధర్మానికి కట్టుబడి ఉండేవాడు. అతను బ్రాహ్మణులకు అనేక ఆవులను బహుమతిగా ఇచ్చేవాడు. ఒకానొక సమయంలో, అతను ఒక బ్రాహ్మణుడికి బహుమతిగా ఇచ్చిన ఆవు మునుపటి సందర్భంలో మరొక బ్రాహ్మణుడికి ఇవ్వటం జరిగింది. ఆ ఆవు తిరిగి క్రొత్త గోమంద లో ఎలా కలిసిందో కలసిపోయింది. అయితే, రాజుకు ఈ విషయం తెలియదు. రెండో బ్రాహ్మణునికి బహుమతిగా ఇచ్చిన తరువాత, ఆ ఆవును మొదటగా బహుమతిగా పొందిన ఆ తొలి బ్రాహ్మణుడు ఆ ఆవు తనకు చెందినదని విన్నవించినాడు. అప్పుడే బహుమతిని అందుకున్న ఈ బ్రాహ్మణుడు కూడా 'అది నాది' అని వాదించడం ప్రారంభించినాడు.

రాజు ఇద్దరికీ ఎక్కువ ఆవులను ఇస్తానని బ్రాహ్మణులకు సర్ది చెప్పాడు మరియు తగాదాను విడిచిపెట్టమని వారిని అభ్యర్థించాడు. కానీ వారు దీనిని పట్టించుకోలేదు.

కొన్ని రోజుల తరువాత, రాజు మరణించాడు. ఒక బ్రాహ్మణ ఆస్తిని అతను తీసుకున్న పాపం దృష్ట్యా, తెలియకుండానే, అతను ఒక పెద్ద బావిలో పెద్ద కొండచిలువగా జన్మించినాడు. ఒకరోజు, అక్కడికి ఆడుకోవడానికి వచ్చిన శ్రీకృష్ణుని గోప బాలురు పామును చూసి, బయటకు తీయడానికి ప్రయత్నించినారు. కానీ వారు ఆ పని చేయలేకపోయారు. వారు ఈ విషయాన్ని తమ తండ్రికి చెప్పినారు. క్షణంలో శ్రీ కృష్ణుడు వచ్చి, పామును బయటకు తీసినాడు. శ్రీ కృష్ణుడి స్పర్శ కారణంగా, పాము శాపం నుండి విముక్తి పొంది, తిరిగి తన అసలు రూపాన్ని పొందినది.

అతను పాము ఎలా అయ్యాడు అని అడిగితే, అతను తన కథను శ్రీ కృష్ణుడికి చెప్పినాడు.

ఇది విన్న శ్రీ కృష్ణుడు తన ప్రజలను పిలిచి, ఎట్టి పరిస్థితుల్లోనూ, ఒక బ్రాహ్మణుడికి బహుమతిగా ఇచ్చిన దానిని గానీ, దానంగా ఇచ్చిన దానిని తిరిగి తీసుకోకూడదని ఆదేశించినాడు. కాబట్టి, ఒకసారి ఇచ్చిన దానిని ఎవ్వరూ వెనక్కి తీసుకోకూడదు, అలాగే ఒకరి సొత్తును మరొకరు కాజేయకూడదు అని స్పష్టమగుచున్నది.

ब्राहमणार्थो हयपहृतो हर्तारं पातयत्यधः । अजानन्तमपि हयेनं नृगं ब्राहमणगौरिव ॥

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి,**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం.**

Our mail ID : info@voiceofjagadguru.com

## అనుగ్రహ భాషణం 5 - కలియుగంలో జీవితాన్ని ఎలా గడపాలి మనం ?



మన పూర్వీకులు ఆనందకరమైన జీవితం కోసం అనేక ఆదర్శవంతమైన మార్గాలను మనకు అందించియున్నారు. మన జీవితంలో వాటిని మనం సరిగ్గా పాటిస్తే ఎంతో మంచిది. కొందరు, "ఇది కలియుగం, ఇది ఇలాగే వుంటుంది. జీవనశైలి చాలా భిన్నంగా ఉంటుంది, ప్రతికూల అంశాలు ఎక్కువగా కనిపిస్తాయి. సత్యం, చట్టం, ధర్మం ఇప్పుడు వర్తించవు. ఏదోలాగ మనం మన జీవితాన్ని గడపాలి" అని అంటూ వుంటారు. ఇది చాలా తప్పు. కలియుగంలో మనం ధర్మ మార్గాన్ని అనుసరించకూడదని ఎక్కడా చెప్పబడలేదు. సూర్యుడు లేనంత మాత్రాన రాత్రి పూట మనం దినచర్యలను ఆపుతున్నామా ?

అదేవిధంగా, మనం ఈ కలియుగంలో కూడా, సత్యం, చట్టం మరియు ధర్మాన్ని క్రమం తప్పకుండా పాటించాలి. అన్ని యుగాలలో 'ధర్మానికి విజయం' మరియు 'అధర్మానికి అపజయం' ఉంటుందని మన పూర్వీకులు గట్టిగా చెప్పియున్నారు. 'నిప్పు కాలుతుంది' అనేది సర్వ సాధారణమైన విషయం. కలియుగంలో చెప్పబడిన అతి ముఖ్యమైన ధర్మం భగవంతుని నామ జపం. మనం భగవంతుని మహిమను గ్రహించి, మరింత శ్రద్ధతో, భక్తితో ఆరాధన చేయాలి. ఎడారిలో ఏ కొద్ది మొత్తంలో నీరు లభించినా అది చాలా ప్రశంసించబడుతుంది. అదే విధంగా, ఈ కలియుగంలో ఒక వ్యక్తి ధర్మ మార్గాన్ని ఏ కొద్ది మేర అనుసరించినా, అతడిని మనం ప్రశంసించాలి. నాకెందుకులే అని మౌనంగా వుండకూడదు.

एतादृशे कलियुगेऽपि शतेषु कश्चित् जातादरो जगति यः श्रुतिमार्ग एव।

यत्किंचिदाचरतु पात्रमसौ स्तुतीनां श्लाघ्यं मितापमपि किं न मरो सरश्चेत् ॥


కనుక కలియుగాన్ని ఎత్తి చూపి తప్పించుకొని, 'ధర్మ మార్గాన్ని' అనుసరించకుండా, మనల్ని మనం సర్దుకోవడం ఎంత మాత్రం సరైన వైఖరి కాదు. కాబట్టి దీనిని మన మనస్సులో ఉంచుకుని, శ్రద్ధ మరియు భక్తితో భగవంతుని నామాన్ని జపిస్తూ, మనం 'ధర్మ మార్గాన్ని' అనుసరించాలి.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం.**

తెలుగు అనువాదము, రచన - శ్రీ భాస్కరానంద నాథ

Our mail ID : info@voiceofjagadguru.com

## అనుగ్రహ భాషణం 6 - వాగ్దానములను నిలబెట్టుకోండి



సాధారణంగా, చాలా మంది వ్యక్తులు పెద్ద పెద్ద వాగ్దానములు చేస్తారు. దాని కోసం అది చేస్తాము, ఇది చేస్తాము అని ప్రగల్భాలు పలుకుతారు. చివరకు వారు మాటను నిలబెట్టుకోవడంలో విఫలమవుతారు. ఒకరికి మాట ఇచ్చి దానిని నిలబెట్టుకోలేక పోవడం మహా పాపం, ప్రత్యేకించి, బ్రాహ్మణులకు చేసిన వాగ్దానం నెరవేర్చలేక పోయినప్పుడు.

దీనికి సంబంధించి మహాభారతంలో ఒక కథ ఉన్నది. ఒక అడవిలో నక్క, కోతి స్నేహితులుగా జీవిస్తున్నాయి. నక్క శ్మశానవాటికలో శవాలను తింటూ బ్రతికేది. ఒకసారి, కోతి నక్కను ఇలా అడిగింది...

किं त्वया पातकं पूर्वं कृतं कर्म सुदारुणम् | यस्त्वं श्मशाने मृतकान् पूतिकानत्सि कुत्सितान् ||

"శవాలు దుర్వాసన వెదజల్లుతుంటాయి గదా, నీవు వాటిని ఎలా తింటున్నావు. నీవు పూర్వ జన్మలో ఏ మహా పాపం చేసావు"?...అని అడిగింది. దానికి నక్క ఇలా సమాధానం ఇచ్చింది:

ब्राहमणस्य प्रतिश्रुत्य न मया तदुपाहृतम् | तत्कृते पापकीं योनिमापन्नोऽस्मि प्लवङ्गम ||

"నేను, నా పూర్వ జన్మలో ఒక మహా పాపం చేసినాను, ఏమిటంటే ఓ బ్రాహ్మణునికి వాగ్దానము చేసి, నెరవేర్చలేక పోయాను. ఆ మహా పాపమే నన్ను ఈ దుస్థితికి తీసుకొని వచ్చింది ఈ జన్మలో". యుధిష్ఠిరునికి ఈ కథను వివరిస్తూ, భీష్ముడు ఓ మాట అంటాడు...

तस्माद्दातव्यमेवेह प्रतिश्रुत्य युधिष्ठिर | यदीच्छेच्छोभनां जातिं प्राप्तुं भरतसत्तम ||

“ఎవరైతే గొప్ప జన్మను కోరుకుంటారో వారు తమ మాటలను, వాగ్దానములను నిలబెట్టుకోవాలి మరియు వీలైనంతగా దానధర్మాలు చేయాలి” అని. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ సత్యాన్ని గ్రహించి, తదనుగుణంగా ప్రవర్తించి భగవంతుని కృపను పొందగలరు.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం.**

Our mail ID : info@voiceofjagadguru.com

## అనుగ్రహ భాషణం 7 - శ్రీ చక్ర ఉపాసన



పరమాత్మ, ప్రకృతి (శక్తి) సహాయంతో ఈ ప్రపంచాన్ని సృష్టించినాడు. శ్వేతాశ్వతర ఉపనిషత్తు దీనిని గురించి చెబుతూ, కిం కారణం బ్రహ్మ? "ఈ విశ్వానికి కారణం ఏమిటి? బ్రహ్మమా?" అని ప్రశ్నిస్తుంది. ఈ మహా సృష్టికి కారణం ఏమిటి? ఎక్కడ నుంచి ఎందుకు మనం జన్మించాము? దేనివల్ల మనం జీవిస్తున్నాము? తుదకు మన విశ్రాంతి స్థలం ఎక్కడ? మన సుఖదుఃఖాలన్నీ ఎవరివల్ల, దేనివల్ల నిర్ణయం అవుతున్నాయి? ఏ శాసనాలు మనల్ని నడుపుతున్నాయి? పరబ్రహ్మ అంటే ఏమిటి? ఉపనిషత్తు ఏమి సమాధానం ఇస్తుందంటే ?

తే ధ్యానయోగానుగతా అపశ్యన్ దేవాత్మశక్తి స్వగుణైర్నిగూఢాం ।

పరం బ్రహ్మం తన ఆత్మ శక్తితో ఈ విశ్వాన్ని రచించినది అని దీని అర్థం. శంకర భగవత్పాదులు, సూత్ర భాష్యంలో ఈ విషయం గురించి ప్రస్తావిస్తూ, ఇదే విషయాన్ని ప్రకటించినారు. పారమేశ్వర్యాః శక్తేః సమస్త జగద్విధాయిన్యాః.

పరంపరానుగతంగా మనకు అందజేయబడిన సంప్రదాయంలో శక్తికి అనేక పేర్లు వున్నాయి. పర దేవత ని పూజించడంలో, శ్రీ చక్రం చాలా విశిష్టమైనది. ఎలాగైతే సాలిగ్రామం (గుండ్రని రాయి) లో విష్ణువు శక్తి నిక్షిప్తమై వుంటుందో, అలాగే శ్రీ చక్రం లో పర దేవత నివసిస్తూ వుంటుంది. అందుచేత శ్రీ లలితా సహస్రనామం లో "శ్రీచక్రరాజనిలయ" అని స్పష్టంగా వశిన్యాది దేవతలు కొనియాడినారు.

భగవత్పాద శంకరులు సహజంగా వేదాంత జ్ఞానం, తత్వజ్ఞానం, అద్వైత సిద్ధాంతమును గురించి బోధించినారు. కానీ లౌకిక విషయాలలో పరదేవత అనుగ్రహం పొందాలంటే శ్రీచక్రాన్ని పూజించడం తప్పనిసరి అని అన్నారు. భావనోపనిషత్తు వంటి గొప్ప రచనలు శ్రీ చక్ర ఉపాసన గురించి అత్భుతంగా వివరించినాయి. సద్గురువు వద్ద శ్రీచక్రార్చన నేర్చుకుంటే అత్యుత్తమ ఫలితము వుంటుంది మరియు పూజను ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా చేస్తే, అది జ్ఞానానికి, మోక్షానికి దారి తీస్తుంది. సర్వం శ్రీ గురుచరణారవిందార్పణమస్తు...

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం,, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం.**

తెలుగు అనువాదము, రచన - శ్రీ భాస్కరానంద నాథ

## అనుగ్రహ భాషణం 8 - అన్ని కర్మలను భగవంతునికే సమర్పణ చేయండి

మానవులందరూ చివరికి మోక్షాన్ని పొందాలని కోరుకుంటారు. అందుకు శాస్త్రాలు అనేక సాధనలు, మార్గములు సూచించినాయి. అవి: వివేకుడు లేదా శాశ్వతమైన మరియు అశాశ్వతమైన వాటి మధ్య వివక్ష చూపగలగడం, లేదా వైరాగ్యం లేదా అశాశ్వతం పట్ల నిర్లిప్తత, మనస్సు నియంత్రణ, ధ్యానం మొదలైనవి.



వాటిలో మనస్సును నియంత్రించడం ఒక ముఖ్యమైన సాధన. కొంతమంది మాత్రమే మనస్సు నియంత్రణను త్వరగా సాధించగలుగుతారు. చాలా మందికి ఇది చాలా కష్టంగా ఉంటుంది. వీరు భగవద్గీత పఠించడం కోసం కూర్చుంటే వారి మనస్సు ఎక్కడో తిరుగుతుంది. భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు ప్రజలు ఆందోళన చెందవద్దని ఉద్బోధిస్తాడు మరియు నిరంతర సాధన వైపు వారిని ఉత్తేజపరుస్తాడు:

**అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరం | అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ||**

అంటే, మీరు మీ మనస్సును భగవంతుడిపై స్థిరపరచలేకపోతే, పదేపదే ప్రయత్నించండి. కొంతమందికి, ఈ అభ్యాసం కూడా చాలా కష్టం, ఎందుకంటే మనస్సు కోతి వంటిది అన్ని వైపులా తిరుగుతుంది. ఈ సమస్యతో బాధపడేవారికి భగవద్గీతలో మరోచోట భగవంతుడు ఇలా సలహా ఇస్తాడు.

**అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ | మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి ||**

అదేమిటంటే, పదేపదే ప్రయత్నించినా మనసు అదుపులో లేకపోతే భగవంతుని ధ్యానించి, మీ కర్మలన్నిటినీ ఆయనకు అంకితం చేయండి. దాని వల్ల మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. ఎవరైతే ఎల్లప్పుడూ భగవంతుని గురించే ఆలోచిస్తూ, తన కర్మలన్నిటినీ ఆయనకు అంకితం చేస్తారో వారు ఎల్లప్పుడూ తృప్తిగా, ఆనందంగా ఉంటారు మరియు అతని మనసు ప్రశాంతంగా ఉంటుంది. గురువు అనుగ్రహంతో అంచెలంచెలుగా ముందుకు సాగి మోక్షాన్ని పొందుతారు. ఈ సూత్రాన్ని అందరూ అర్థం చేసుకుని ఆచరణలో పెట్టాలని ఆశీర్వదిస్తున్నాం.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం,, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం.**

తెలుగు అనువాదము, రచన - శ్రీ భాస్కరానంద నాథ

Our mail ID : info@voiceofjagadguru.com

## అనుగ్రహ భాషణం 9 – నిష్పక్షపాతమైన తీర్పు



**మానాద్వా యది వా లోభాత్ క్రోధాద్వా యది వా భయాత్ |**
**యో న్యాయమన్యథా బ్రూయాత్ స యాతి నరకం నరః ||**

ప్రతి వ్యక్తికి కొన్ని విధులు, బాధ్యతలు వుంటాయి. అతను తన విధిని సరైన రీతిలో నిర్వర్తించడంలో విఫలమైతే, అతను పాపం చేసినట్లు లెక్క. అలాంటి విధులలో న్యాయం ఒకటి, తీర్పు చెప్పేటప్పుడు తన విధుల నుంచి తప్పించుకోలేని బాధ్యత "న్యాయం" అనేది. ఒక వ్యక్తి తీర్పు వెలువరించేటప్పుడు, అతను ఇతర కారణాల వలన ప్రభావితుడు కాకూడదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే, ఒక వ్యక్తి డబ్బు ప్రలోభం చేత న్యాయాన్ని అపార్థం చేసుకోని, ఊగిసలాడుతూ అధర్మంగా వక్ర భాష్యం చెప్పకూడదు.

మహాభారతంలో, శకుని కపటంతో, మాయా కుయుక్తుల చేత ధర్మరాజు పాచికల ఆటలో ఓడిపోయినప్పుడు, ద్రౌపది కౌరవ సభలో ఒక ప్రశ్న లేవనెత్తింది... "ధర్మరాజుకు చేసిన పరాభవం, అప్రతిష్ట న్యాయానికి అనుగుణంగా ఉన్నదా?" అని. సభలో చాలా మంది ప్రాజ్ఞులు, పండితులు ఉన్నప్పటికీ, దుర్యోధనుడి ఆగ్రహానికి భయపడి వారు మాట్లాడటానికి, ప్రతిఘటించడానికి వెనుకాడినారు. అటువంటి పరిస్థితి సంభవించకూడదు. ఏ విషయంలోనూ, ఏ పరిస్థితిలోనూ న్యాయం తిరస్కరించబడకూడదు లేదా దారి తప్పకూడదు. ఎందుకంటే, న్యాయం అత్యున్నతమైనది. ఈ సత్యాన్ని అందరూ అర్థం చేసుకోవాలి.

న్యాయాధీశులుగా ఉన్నవారు భగవంతుని కృపకు, దయకు పాత్రులు అయ్యేలా తమ కర్తవ్యంలో నిష్పక్షపాతంగా ఉండాలి.**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**

**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం, శృంగేరి.**

Our mail ID : info@voiceofjagadguru.com

## జగద్గురు వాణి - అనుగ్రహ భాషణం 10 – రెండు గొప్ప శత్రువులు



మనిషికి ఇద్దరు శత్రువులు ఉన్నారు, ఒకటి 'అహంకారము' మరియొకటి 'మమకారము'. అహంకారము "నేను, నేను" అంటే, మమకారము "నాది", "నాది" అంటూ వుంటుంది. ఎప్పుడైనా ఏదైనా వస్తువును స్వీకరించినప్పుడు, "ఇది నాది" అనే భావన మమకారం వల్ల వస్తుంది. అదేవిధంగా, ఏదైనా పని చేసినప్పుడు, "ఇది నేను చేసినాను" అనే భావన అహంకారం వలన కలుగుతుంది.

ఒక సంఘటన నా మదిలో మెదులుతున్నది. ఆచార్యులు వారు ఒకసారి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నప్పుడు, వారు ఒక క్షేత్రాన్ని సందర్శించినారు. ఆ ప్రదేశం ఎంతో పుణ్య స్థలం అయినప్పటికీ, చాలా మంది యాత్రికులను అది ఆకర్షించుట లేదు, ఎందుకంటే ప్రయాణ సౌకర్యాలు సరిగా లేవు అక్కడ. ఒక అధికారి దీనిని సరిదిద్దే కార్యక్రమమును చేపట్టి, ఎన్నో ఏర్పాట్లు చేసినాడు. ఆ తర్వాత ప్రజలు పెద్ద సంఖ్యలో ఆ ప్రదేశాన్ని సందర్శించడం ప్రారంభించినారు. ఆచార్యులు వారు అక్కడికి వెళ్లినప్పుడు, ఆ అధికారి అక్కడి విషయాలను చూపిస్తూ, అది అంతా తన కృషి వలననే అని ప్రగల్భాలు పలికినాడు. ఆచార్యులు వారు మౌనంగా ఉండిపోయినారు. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు వచ్చినప్పుడు, ఆచార్యుల వారు ఆగిపోయినారు. వారు ఆలయ గోపురాన్ని చూసి ఆ వ్యక్తిని అడిగినారు.

ఆచార్యులు: "మీరు ఈ గోపురాన్ని చూస్తున్నారా?".

అధికారి: అవును, చూస్తున్నాను.

ఆచార్య: దీని ఎత్తు ఎంత ?

అధికారి: చాలా ఎక్కువ.

ఆచార్యులు: దానితో పోలిస్తే మనం ఎక్కడ ఉన్నాము?

అధికారి: చాలా తక్కువ స్థాయిలో.

ఆచార్యులు: అలాంటి గోపురాలను ఎందుకు నిర్మించినారో మీకు తెలుసా? ఇది మన అహంకారాన్ని వదిలించుకోవడానికి, మనం ఎంతటి అజ్ఞానమైన హీన స్థితిలో ఉన్నామో తెలియబరిచేలా చేస్తుంది. ఈ అద్భుతమైన విశ్వ సృష్టికర్త అయిన విశ్వనాథుడిని గురించి ఆలోచించినప్పుడు, వారి అద్భుతమైన పనులతో పోలిస్తే, వారి ముందు మనం సాధించినది ఏమంత ముఖ్యమైనది కాదని తెలుసుకుంటాము. అందువల్ల, "నేను దీన్ని చేసాను" వంటి ఆలోచనలను కలిగి వుండటం చాలా అర్థరహితం.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం, శృంగేరి.**

Our mail ID : info@voiceofjagadguru.com

| Editorial Board | | |
|---|---|---|
| Sri P A Murali | Hon' Advisor | Administrator & CEO, Sri Sringeri Mutt & It's Properties, Sringerī |
| Sri S N Krishnamurthy | Hon' Editor | Sri Sringeri Mutt, Sringeri |
| Sri Tangirala Shiva Kumara Sharma | Hon' Editor | Sri Sringeri Mutt, Sringeri |
| B. Vijaya Anand<br>—-------------------------------------<br>B Srimathi Veeramani | Web Director<br>—------------------<br>Web Asst.Director & Chief Editor | Coimbatore<br>—--------------------------------------------------------------<br>-------------Tirunelveli |
| K M Kasiviswanathan | Hon' Editor | Tirunelveli |
| Sri Bhaskarananda Natha | Writer/Translator | Nellore |


Our mail ID : info@voiceofjagadguru.com